# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 121 13-5-2026 వెల: రూ.2/- పేజీలు: 06







## పుట్టపర్తిలో రూ.లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ

**మే 15న శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్**

**ఈ ప్రాజెక్టుతో 20 వేల మందికి ఉపాధి అవకాశాలు**

**పుట్టపర్తి నుంచి ఏం టేకాఫ్ అవుతుందో ఊహించగలరా అంటూ లోకేష్ ట్వీట్**

**ఆధునిక యుద్ధ విమానం ఏఐ వీడియోను పంచుకున్న నారా లోకేష్**




ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. "మే 15న పుట్టపర్తి నుంచి ఏం టేకాఫ్ అవుతుందో ఊహించ గలరా?" అంటూ ఆయన మంగళవారం ట్వీట్ చేశారు. దీనికి జతగా, ఓ అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం ఆకాశంలోకి దూసుకెళ్తున్న ఏఐ (ఏఐ) వీడియోను కూడా పంచుకున్నారు.

2లో

## అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

**ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు**

**ఎన్‌డి ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక**




గౌహతి,మే12: అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు.అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో

2లో

## పెట్రో రేట్లను పెంచబోమని చెప్పలేం!

**ఇంధన ధరల పెంపుపై కేంద్ర ప్రభుత్వం యూటర్న్**

**ధరలు పెంచమంటూ ఎన్నికల ముందు పదేపదే ప్రకటనలు**

**ఎన్నికలయ్యాక నాలుక మడతేసిన బీజేపీ సర్కార్**



న్యూఢిల్లీ, మే 12: దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఎట్టి పరిస్థితుల్లో పెంచబోమని ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు ఊదరగొట్టిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలు పూర్తవగానే యూటర్న్ తీసుకుంది. ఎప్పుడెప్పుడు పెంచుదామా అన్నట్టు చమురు కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని పదేపదే ప్రస్తావిస్తున్నది. ఈ క్రమంలో దేశంలో చమురు సరఫరాకు ఎలాంటి కొరత లేదని పేర్కొంటూనే, వాటి ధరను పెంచే అవకాశాన్ని కొట్టిపారేయ లేమంటూ కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మంగళవారం స్పష్టం చేశారు. ఒక పక్క విదేశీ ప్రయాణాలకు స్వస్తి పలకాలని, ఏడాది పాటు బంగారాన్ని కొనుగోలు చేయవద్దని, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, కార్ పూలింగ్ పాటించాలని, మెట్రోలలో ప్రయాణించాలని, వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలని, ఆన్‌లైన్‌లో తరగతులను నిర్వహించాలని ప్రధాని చమురు పొదుపు చర్యల కోసం

2లో



## ఎంఎంటీఎస్ ఉచిత ప్రయాణం.. జూన్ 2 నుంచేనా?

**ఎంఎంటీఎస్ ఉచిత ప్రయాణంపై రైల్వేబోర్డుకు అందని రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు**

**బోర్డుతో అవగాహన ఒప్పందం కుదరాలన్న దక్షిణ మధ్య రైల్వే**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన ఎంఎంటీఎస్ ఉచిత ప్రయాణం దిశగా ఇప్పటివరకు అడుగు ముందుకు పడలేదు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా

2లో



## బీఆర్ఎస్ కీలక నేతలతో కేసీఆర్ భేటీ

**ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం నిర్వహించిన కేసీఆర్**

**పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం**

**పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై ఫోకస్**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం జరిగింది. పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై ఈ భేటీలో స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం... జిల్లా, నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జుల నియామకం,

2లో

## బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు

**మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణల కేసు**

**రేపు మధ్యాహ్నం విచారణకు హాజరు కావాలని నోటీసులు**

**కేసును సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం**



కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడనే ఆరోపణలతో

2లో

# 'నీట్' పరీక్ష రద్దు

## పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో ఎన్‌టీఏ కీలక నిర్ణయం

## అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడి..

- త్వరలో పరీక్ష తేదీ ప్రకటన.. మళ్లీ అడ్మిట్ కార్డుల జారీ
- రుసుము చెల్లించకుండా మరోసారి పరీక్షకు హాజరయ్యే అవకాశం
- లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం..
- మాస్టర్‌మైండ్ సహా 20 మందిని అదుపులోకి తీసుకున్న రాజస్తాన్ ఎస్‌ఓజీ
- గెస్ పేపర్‌లోని కొన్ని ప్రశ్నలు అసలైన ప్రశ్నపత్రంలో ప్రత్యక్షం
- పరీక్షకు 15 రోజుల ముందే కొందరు అభ్యర్థులకు చేరిన గెస్ పేపర్

న్యూఢిల్లీ: వైద్య విద్య అభ్యసించి, డాక్టర్‌గా ప్రజలకు సేవలందిస్తూ జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్న ఆశయంతో జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్)కు హాజరైన లక్షలాది మంది అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పిడుగులాంటి వార్త వినిపించింది. దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి

2లో






## అభిమానం.. అనంతం

**వారందరికీ అభివాదం చేస్తూ ఆప్యాయంగా**

**పలకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**

**వివాహ రిసెప్షన్‌కు హాజరై దంపతులకు ఆశీస్సులు**

అనంతపురం: కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ నేత, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ కుమారుడు చైతన్యమిత్ర, అనంతపురం జిల్లా పామిడికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత వీరాంజనేయులు కుమార్తె, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ లిఖితలకు ఇటీవల వివాహమైంది.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## పుట్టపర్తిలో రూ.లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ

ఈ పోస్ట్ ద్వారా పుట్టపర్తిలో రాబోతున్న భారీ ప్రాజెక్టుపై ఆయన అంచనాలను పెంచారు.శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రాంతంలో సుమారు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం ఈ నెల 15వ తేదీన జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు.ఈ మెగా ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అంచనా. రాష్ట్రంలో రక్షణ రంగ ఉత్పాదనను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. శంకుస్థాపన కార్యక్రమం సమీపిస్తున్న తరుణంలో, మంత్రి నారా లోకేష్ చేసిన ఈ టీజర్ ట్వీట్ ప్రాజెక్టుపై సర్వత్రా ఆసక్తిని పెంచుతోంది.

## పెట్రో రేట్లను పెంచబోమని చెప్పలేం!

దేశ పౌరులకు సలహాలు ఇస్తుండగా, మరో వైపు చమురు ధరలు పెరుగుతాయంటూ ఆ శాఖ మంత్రే సూచన ప్రాయంగా తెలియజేశారు.'గత నాలుగేండ్లుగా మనం చమురు ధరలను పెంచలేదు. ఎన్నికలై పోయాయి కాబట్టి ఇప్పుడు వాటి ధరలు పెంచుతారంటూ కొందరంటున్నారు. అయితే 2022 తర్వాత మనకు సాధారణ ఎన్నికలతో పాటు పలు ఎన్నికలు దేశంలో వచ్చాయి. ధరలు పెరగవని చెప్పడం నా వాదన కాదు. అయితే ఆ రెండింటికీ సంబంధం లేదన్న విషయాన్ని మాత్రం స్పష్టం చేయదలచుకున్నా' అని ఆయన చెప్పుకొచ్చారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వల్ల ఇంధన పొదుపు చర్యల గురించి ప్రధాని కోరుతున్నారని తెలిపారు.

## బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు

అతనిపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విచారణకు హాజరు కావాలంటూ సిట్ నోటీసులు పంపించింది. రేపు మధ్యాహ్నం రెండు గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది.బండి భగీరథ్ కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకుంది. కేసు విచారణ పారదర్శకంగా జరగాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీజీపీని ఇటీవల ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ కేసు సిట్ విచారిస్తోంది. బండి భగీరథ్?పై బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మరోవైపు, తనను హనీట్రాప్ చేశారని బండి భగీరథ్ కరీంనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## బీఆర్ఎస్ కీలక నేతలతో కేసీఆర్ భేటీ

అలాగే అంతర్గత కమిటీల ఏర్పాటుపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి ఈ సంస్థాగత మార్పులు దోహదపడతాయని నాయకత్వం భావిస్తోంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, శాసనసభ, మండలి పక్షాల ప్రముఖ నేతలు పాల్గొన్నారు. హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, బండ ప్రకాశ్ ముదిరాజ్, వి. గంగాధర్ గౌడ్, జోగినపల్లి సంతోశ్ కుమార్, నారదాసు లక్ష్మణరావు, ఆర్. శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, టి. జీవన్ రెడ్డి, సోమా భరత్ కుమార్ గుప్తా, సత్యవతి రాథోడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సురేశ్ రెడ్డి, మహమూద్ అలీ, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మరియు ఇతర రాజకీయ సవాళ్లపై ఈ సమావేశంలో నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రభుత్వ విధానాలపై పోరాటం చేస్తూనే, ప్రజల్లోకి పార్టీని మరింత సమర్థవంతంగా తీసుకువెళ్లేందుకు అవసరమైన ప్రణాళికలను ఈ సమావేశంలో సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించాలని, అలాగే జిల్లా పర్యటనల ద్వారా క్యాడర్‌తో నేరుగా మమేకం కావాలని కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది.


## అభిమానం.. అనంతం

మంగళవారం పామిడిలో నిర్వహించిన వీరి రిసెప్షన్‌కు పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేశారు. వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అక్కడికి భారీగా చేరుకున్న పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేశారు. అంతకు ముందు వేదిక ప్రాంతానికి వస్తుండగా దారిపొడవునా ప్రజలు పెద్ద సంఖ్యలో రోడ్డుకు ఇరువైపులా నిల్చొని 'జై జగన్' అంటూ నినాదాలు చేశారు. వారందరికీ వైఎస్ జగన్ చిరునవ్వుతో అభివాదం చేశారు. యువతతో కరచాలనం చేస్తూ, చిన్నారులను ముద్దాడుతూ ముందుకు సాగారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డితో పాటు పార్టీ నేతలు పలువురు వధూవరులను ఆశీర్వదించారు.

## వైసీపీ నేత నిత్యానందరెడ్డికి 14 రోజుల రిమాండ్

**పెద్ద దస్తగిరి హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిత్యానందరెడ్డి**

**ఈరోజు కోర్టులో హాజరుపరిచిన పోలీసులు**



రిమాండ్ విధించడంతో కడప సెంట్రల్ జైలుకు తరలించిన పోలీసులుకడప జిల్లా రాజకీయాల్లో సంచలనం సృష్టించిన పెద్ద దస్తగిరి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేత నిత్యానందరెడ్డికి న్యాయస్థానం రిమాండ్ విధించింది.పెద్ద దస్తగిరి హత్య కేసులో అరెస్టయిన వైసీపీ నేత నిత్యానందరెడ్డిని పోలీసులు ఈరోజు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయస్థానం ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయన్ని కడప సెంట్రల్ జైలుకు తరలించారు. కడప జిల్లాలో కీలక నేతగా ఉన్న నిత్యానందరెడ్డి అరెస్ట్, రిమాండ్ ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ఫ్యాక్షన్ రాజకీయాలు, పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందా అనే కోణంలో చర్చ సాగుతోంది. ఈ కేసు తదుపరి విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ



పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు.హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్రమానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

# 'నీట్' పరీక్ష రద్దు

ఈ నెల 3వ తేదీన జరిగిన నీట్(యూజీ)--2026 పరీక్షను రద్దు చేసినట్లు మంగళవారం ప్రకటించింది. నీట్ ప్రశ్నపత్నం లీక్ అయినట్లు అనుమానాలు తలెత్తిన నేపథ్యంలో జాతీయ పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను కాపాడటం, విశ్వాసాన్ని నిలబెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేసింది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని సీబీఐని కేంద్రం ఆదేశించిందని, దర్యాప్తు సంస్థకు తమ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని, అవసరమైన రికార్డులు సమకూరుస్తామని ఎన్‌టీఏ స్పష్టంచేసింది. పరీక్ష జరిగిన నాలుగు రోజుల తర్వాత.. అంటే మే 7న సాయంత్రం అవకతవకలకు సంబంధించిన సమాచారం ఎన్‌టీఏకు అందింది. స్వతంత్ర ధ్రువీకరణతోపాటు అవసరమైన చర్యల కోసం మే 8వ తేదీ ఉదయం కేంద్ర దర్యాప్తు సంస్థలకు నివేదించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది.

**పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని కాపాడేందుకే..**

పరీక్షకు ముందే 410 ప్రశ్నలతో కూడిన 'గెస్ పేపర్'కొందరు అభ్యర్థుల మధ్య సర్క్యులేట్ అయ్యిందని, అందులో 120 కెమిస్ట్రీ, 100కు పైగా బయాలజీ ప్రశ్నలు అసలైన ప్రశ్నపత్రంతో యథాతథంగా సరిపోలాయన్న ప్రచారంతో 'నీట్'ను రద్దు చేసి, మళ్లీ నిర్వహించడమే ఉత్తమమన్న నిర్ణయానికి వచ్చినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. ఈ నెల 3న భారత్‌తోపాటు విదేశాల్లో జరిగిన నీట్(యూజీ)--2026 పరీక్షను 22.79 లక్షల మంది రాశారు. పేపర్ లీకేజీతో వారంతా నిరాశకు గురయ్యారు. పరీక్ష మళ్లీ నిర్వహిస్తామని, అభ్యర్థులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎన్‌టీఏ ప్రకటించింది. పరీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలియజేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించడం వల్ల అభ్యర్థులకు, తల్లిదండ్రులకు అసౌకర్యం కలిగే మాట నిజమేనని ఎన్‌టీఏ అంగీకరించింది. కానీ, పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని కాపాడేందుకు నీట్ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

**'గెస్ పేపర్'కోసం రూ.30 లక్షలు**

'గెస్ పేపర్'కోసం ఒక్కో విద్యార్థి దాదాపు రూ.30 లక్షల చొప్పున వెచ్చించినట్లు తమ విచారణలో తేలిందని రాజస్తాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్(ఎస్ఓజీ) ఏడీజీ విశాల్ బన్సాల్ మీడియాకు తెలిపారు. ఈ గెస్ పేపర్ పరీక్షకు 15 రోజుల ముందే అభ్యర్థులకు చేరిందన్నారు. డెహ్రాడూన్ నుంచి కేరళ మీదుగా సికార్‌కు చేరిన ఈ పేపర్‌ను ఒక్కో విద్యార్థి రూ.20 వేల నుంచి రూ.30 లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేసినట్లు విచారణలో బయటపడిందన్నారు.

పరీక్ష ముందు రాత్రి అంటే.. మే 2వ తేదీ రూ.30 వేలకు కూడా కాపీలు అమ్మినట్లు ఆధారాలు లభించాయని ఎన్‌టీఏకు, కేంద్ర పభుత్వానికి నివేదించారు. ఎస్ఓజీ దర్యాప్తులో భాగంగా లభించిన ఆధారాలతో ఇప్పటివరకు మాస్టర్‌మైండ్ సహా 20 మందికి పైగా అదుపులోకి అనుమానితులను తీసుకున్నట్లు సమాచారం. నీట్ పేపర్ లీకేజీకి జైపూర్‌కు చెందిన మనీష్ అనే వ్యక్తిని మాస్టర్ మైండ్‌గా గుర్తించారు. రాజస్తాన్‌లో సికార్ పట్టణానికి చెందిన ఒక కోచింగ్ కెరీర్ కౌన్సెలర్‌ను అరెస్టు చేశారు.

ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ

నీట్ పేపర్ లీక్ అంశం దేశవ్యాప్తంగా దుమారం సృష్టించింది. పలు ప్రాంతాల్లో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎన్‌టీఏ స్పందించి పరీక్షను రద్దు చేసింది. లీకేజీ వ్యవహారంలో ఎంతటి వారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. సీబీఐ రంగంలోకి దిగింది. ఇప్పటికే రాజస్తాన్ పోలీసుల దర్యాప్తులో లభించిన వాట్సాప్ చాటింగ్‌లు, స్క్రీన్‌షాట్లు, బ్యాంక్ లావాదేవీల వివరాలు, యూపీఐ చెల్లింపులు, క్రిప్టో చెల్లింపులను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. పరీక్ష జరిగిన అన్ని సెంటర్ల సీసీటీవీ ఫుటేజీ, బయోమెట్రిక్ డేటాను సేకరించారు. ఆ డేటాను, ఆధారాలను రాజస్తాన్ పోలీసులు సీబీఐకి అప్పగించారు. నీట్(యూజీ) పేపర్ లీక్ అంశంపై సీబీఐ మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

**ముఖం చాటేసిన విద్యాశాఖ మంత్రి**

నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మౌనం వహించారు. ఢిల్లీలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను మీడియా ప్రతినిధులు ప్రశ్నించేందుకు ప్రయత్నించగా, తప్పించుకుని కారెక్కి వెళ్లిపోయారు.

## పోస్టల్ శాఖ జీడీఎస్: మూడో మెరిట్ జాబితా విడుదల..

**ఇండియా పోస్ట్ జీడీఎస్ మూడో మెరిట్ జాబితా విడుదల**

**దేశవ్యాప్తంగా 6,690 మంది అభ్యర్థుల ఎంపిక**

**ఆంధ్రప్రదేశ్‌లో 342, తెలంగాణలో 106 మందికి అవకాశం**

**మే 26 లోగా డాక్యుమెంట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలి**

భారత తపాలా శాఖ గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) పోస్టుల భర్తీ ప్రక్రియలో మరో కీలక ముందడుగు వేసింది. దేశవ్యాప్తంగా 28,636 జీడీఎస్ ఖాళీల భర్తీకి సంబంధించి మూడో మెరిట్ జాబితాను (సప్లిమెంటరీ లిస్ట్-XXX) సోమవారం విడుదల చేసింది. జనవరి 2026 షెడ్యూల్‌లో భాగంగా చేపట్టిన ఈ నియామక ప్రక్రియలో, మొదటి రెండు జాబితాల తర్వాత మిగిలిపోయిన ఖాళీలను ఈ జాబితాతో భర్తీ చేయనున్నారు.ఈ మూడో జాబితాలో దేశవ్యాప్తంగా మొత్తం 6,690 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 342 మంది, తెలంగాణ నుంచి 106 మంది చోటు దక్కించుకున్నారు. ఎంపికైన అభ్యర్థులు తమ అధికారిక ధ్రువపత్రాల పరిశీలన (డాక్యుమెంట్ వెరిఫికేషన్) ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది.జాబితాలో ఎంపికైన అభ్యర్థులు మే 26, 2026 లోపు తమకు కేటాయించిన డివిజనల్ కార్యాలయానికి హాజరు కావాలి. "షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులు తమ పత్రాలను ధృవీకరించుకోవాలి. అన్ని సంబంధిత పత్రాల అసలు ప్రతులు మరియు రెండు సెట్ల ఫోటోకాపీలతో హాజరు కావాలి" అని అధికారిక నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. గడువులోగా వెరిఫికేషన్‌కు హాజరుకాని పక్షంలో వారి అభ్యర్థిత్వం రద్దవుతుంది.

# ఎంఎంటీఎస్ ఉచిత ప్రయాణం.. జూన్ 2 నుంచేనా?

జూన్ 2 నుంచి గ్రేటర్‌లో ఎంఎంటీఎస్ రైళ్లలో అన్ని వర్గాల ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేసేదిశగా ఉచిత సేవలను అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. ఇందుకోసం దక్షిణ మధ్య రైల్వేకు ఏటా రూ.10 కోట్లు అందజేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రతిపాదనపైన దక్షిణమధ్య రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించినప్పటికీ రైల్వేబోర్డు ఆమోదిస్తే తప్ప తాము ఈ సదుపాయాన్ని కల్పించలేమని, రాష్ట్ర ప్రభుత్వం, రైల్వేబోర్డు మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదరాల్సి ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం నగరంలోని వివిధ మార్గాల్లో ప్రతిరోజు సుమారు 75 ఎంఎంటీఎస్ సర్వీసులు నడుస్తున్నాయి. 35 వేల మందికి పైగా ప్రయాణిస్తున్నారు. ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో వ్యక్తిగత వాహనాల వినియోగం కొంత మేరకు తగ్గవచ్చునని అధికారులు భావిస్తున్నారు. 'రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు ఆచరణాత్మకంగానే ఉన్నప్పటికీ రైల్వేబోర్డుకు ఇంకా సమాచారం అందజేయలేదు. ఇప్పటికిప్పుడు ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేసినా రైల్వేబోర్డు పరిశీలించి నిర్ణయం తీసుకొనేందుకు కొంత సమయం పట్టవచ్చు. పైగా ఎంవోయూ కూడా కుదుర్చుకోవలసి ఉంటుంది. జూన్ 2 లోపు ఇదంతా సాధ్యం కాకపోవచ్చుననిపిస్తోంది..'అని దక్షిణమధ్య రైల్వే అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. పైగా ఎంఎంటీఎస్ రెండో దశకు సంబంధించి రాష్ట్రం నుంచి రావలసిన రూ.460 కోట్లకు పైగా బకాయిలపైనా స్పష్టత రావలసి ఉందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో లోకల్ ట్రైన్ సదుపాయాన్ని కల్పించే లక్ష్యంతో ఎంఎంటీఎస్ ప్రాజెక్టును 2003లో స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ)గా ఏర్పాటు చేశారు. దీని నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2/3 వంతు, రైల్వేశాఖ 1/3 వంతు చొప్పున భరించాలని అప్పట్లో నిర్ణయించారు. ఈ మేరకు మొదటి దశ రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. 2013లో ఇదే ఒప్పందం ఆధారంగా రెండోదశను ప్రారంభించారు. కానీ ప్రభుత్వం తన వాటా నిధులను పూర్తిగా చెల్లించలేదు. దీంతో ఈ ప్రాజెక్టును దక్షిణ మధ్య రైల్వే సొంతంగా పూర్తి చేయవలసి వచ్చింది. ప్రస్తుతం ఘటకేసర్ నుంచి రాయగిరి వరకు చేపట్టిన యాదాద్రి ఎంఎంటీఎస్ పనులను కూడా దక్షిణ మధ్య రైల్వే సొంత నిధులతో చేపట్టింది. ఇదిలావుండగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని తెరపైకి తేవడంతో..ఇప్పటివరకు రెండో దశ నిధులను చెల్లించకపోవడాన్ని రైల్వే అధికారులు ప్రధానంగా ఎత్తిచూపుతున్నారు. ఎంఎంటీఎస్ రైళ్లలో సమయ పాలన మెరుగుపడి, సర్వీసులు పెంచితేనే ప్రయాణికులకు ఉచిత సదుపాయం సద్వినియోగమవుతుందని హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ (హుమ్టా) అధికారులు భావిస్తున్నారు.



## జర్నలిస్టు శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించిన ఇంజ మహేష్

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలానికి చెందిన జర్నలిస్టు భూపతి శ్రీనివాస్ తండ్రి భూపతి రామయ్య ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ నేపథ్యంలో మంగళవారం బూరుపల్లి గ్రామంలోని వారి నివాసానికి చేరుకున్న శ్రమశక్తి అవార్డు గ్రహీత, సామాజిక కార్యకర్త ఇంజ మహేష్ మాదిగ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్‌ను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మరణించిన రామయ్య చిత్రపటాన్ని శ్రీనివాస్‌కు అందజేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఎండి యూసుఫ్ బాయ్, చీర మహిపాల్ తదితరులు పాల్గొని మృతుడి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

## పాత ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలి

**- కేంద్ర ప్రభుత్వ కొత్త నిబంధనలపై వ్యవసాయ కార్మిక సంఘం ధ్వజం**

**- 15న గ్రామీణ సమ్మెను జయప్రదం చేయండి: జూకంటి పౌల్**



**తొలివెలుగు, రాజాపేట:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పాత చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం మండల కేంద్రంలో సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి వి.బి. రాంజీ పేరుతో తీసుకొచ్చిన కొత్త నిబంధనలు కార్మికుల పొట్ట గొట్టేలా ఉన్నాయని మండిపడ్డారు.

**ఆస్తుల సృష్టిలో కీలక పాత్ర:**

గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల పూడికతీత, రహదారులు, కాలువల నిర్మాణం, పేదల భూముల అభివృద్ధి వంటి పనుల ద్వారా ఉపాధి కూలీలు శాశ్వత ఆస్తులను సృష్టిస్తున్నారని ఆయన కొనియాడారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఈ పథకాన్ని కొత్త జీవోలతో అస్తవ్యస్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించకపోవడం, చేసిన పనికి కూలి ఎంతో చెప్పకపోవడం, సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తన మొండి వైఖరి వీడి పాత చట్టాన్నే అమలు చేయాలని, లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 15న నిర్వహించ తలపెట్టిన గ్రామీణ సమ్మె (బంద్)ను అందరూ కలిసికట్టుగా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కట్ట రవికుమార్, అధ్యక్షులు గంధమల్ల రాజయ్య, నాయకులు మైసయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలిక.. అరగంటలోనే తల్లిదండ్రుల చెంతకు!

**- ముదుగు ప్రవీణ్ సమయస్ఫూర్తికి ప్రశంసలు**

**- జన్నారం సంతలో ఘటన**

**తొలివెలుగు, జన్నారం:** జనం రద్దీలో తప్పిపోయిన చిన్నారిని ఓ యువకుడు సమయస్ఫూర్తితో గుర్తించి, అరగంటలోనే తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం జరిగిన వారాంతపు సంతకు పొనకల్ గ్రామానికి చెందిన సులువా శ్రీజ, రవి దంపతులు తమ కుమార్తెతో కలిసి వచ్చారు. సంతలో జనసందోహం ఎక్కువగా ఉండటంతో చిన్నారి అనుకోకుండా తల్లిదండ్రుల నుంచి దూరమైంది. చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై సంత పరిసరాల్లో వెతకడం ప్రారంభించారు. ఇదే సమయంలో ఒంటరిగా ఏడుస్తూ ఉన్న బాలికను గమనించిన ముదుగు ప్రవీణ్ వెంటనే అప్రమత్తమయ్యారు. చిన్నారిని ఓదార్చి, ఆమె వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. అనంతరం స్థానికుల సహకారంతో తల్లిదండ్రులను వెతికి, అరగంట వ్యవధిలోనే చిన్నారిని క్షేమంగా వారికి అప్పగించారు. కుమార్తెను సురక్షితంగా చూసిన తల్లిదండ్రులు ఉపశమనం వ్యక్తం చేస్తూ ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముదుగు ప్రవీణ్ చూపిన మానవత్వం, సమయస్ఫూర్తిని స్థానికులు, గ్రామస్తులు అభినందించారు.



# ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో అలసత్వం వహిస్తే వేటే!





- రైతులకు ఇబ్బంది కలిగితే సహించేది లేదు: సీఎం రేవంత్ రెడ్డి
- అవసరమైతే ప్రైవేటు గోదాములను స్వాధీనం చేసుకోండి
- రికార్డు స్థాయిలో 90 లక్షల టన్నుల సేకరణే లక్ష్యం

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/హైదరాబాద్:** రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సచివాలయం నుంచి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రైతులు రోడ్డెక్కే పరిస్థితి రాకుండా జిల్లా యంత్రాంగం 'మిషన్ మోడ్'లో పనిచేయాలని ఆదేశించారు. నిల్వ సదుపాయాల కోసం అవసరమైతే చట్టాలను ఉపయోగించి ప్రైవేటు గోదాములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని సీఎం స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వాడాలని, ఎస్పీలు రవాణా వాహనాల ఏర్పాటులో చురుగ్గా పాలుపంచుకోవాలని సూచించారు. "మిల్లుల వద్ద ధాన్యం కోతలకు తావుండకూడదు. కొనుగోలు కేంద్రంలోనే నాణ్యత పరిశీలించి రశీదులు ఇవ్వాలి" అని ఆయన తేల్చి చెప్పారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడమే లక్ష్యమన్నారు. ఇప్పటివరకు 25.78 లక్షల టన్నుల సేకరణ పూర్తయిందని, రైతులకు రూ. 3,873 కోట్లు చెల్లించామని వివరించారు. హమాలీ చార్జీలను సంచికి రూ. 8.50కు పెంచినట్లు సీఎస్ వెల్లడించారు.

# హనుమాన్ జన్మోత్సవం.. భక్తజన సంద్రం!





**- శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు**

**- ఘనంగా పల్లకి సేవ, అన్నదాన కార్యక్రమాలు**

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మంగళవారం హనుమాన్ జన్మోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు, మాన్య సూక్త అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శత నాగవల్లి దళార్చన, వడమాల సమర్పణ కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ శాశ్వత అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్‌తో పాటు ట్రస్ట్ అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు, దాతల సహకారంతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం, హోమ కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రి వేళ స్వామివారిని పల్లకిలో ఊరేగిస్తూ ప్రత్యేక సేవలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం హనుమాన్ నామస్మరణతో మారుమోగింది.

# మోదీ విదేశాంగ విధానం వైఫల్యం.. దేశానికి గుదిబండ!






**- ప్రజలకు ఉచిత సలహాలు కాదు.. ఆర్థిక భరోసా కల్పించాలి**

**- రేవంత్ సర్కార్ హామీలు అమలు చేయాలి: సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**తొలివెలుగు, చౌటుప్పల్:** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విదేశాంగ విధానాల వల్లే దేశంలో ఆర్థిక సంక్షోభం నెలకొందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మోదీ దాసోహమవ్వడం వల్ల ఇరాన్, రష్యా వంటి సన్నిహిత దేశాలతో వ్యాపార సంబంధాలు దెబ్బతిన్నాయని, తద్వారా చౌకగా రావాల్సిన చమురు, గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉచిత సలహాలు ఇవ్వడం మాని, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంపై దృష్టి సారించాలని సూచించారు.

**హక్కులను హరిస్తున్న చట్టాలు:**

చట్టసభలు నేడు ప్రజల హక్కులను కాలరాయడానికి వేదికలుగా మారాయని జాన్ వెస్లీ ఆవేదన వ్యక్తం చేశారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మికులపై దాడి చేయడమేనన్నారు. విద్యుత్తు, విత్తన చట్టాలు రైతులకు భారంగా మారాయన్నారు. మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టకముందు ఇచ్చిన దళితబంధు, కౌలు రైతులకు సాయం, మహిళలకు రూ. 2,500 వంటి హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**పోరాటాలకు సిద్ధం కావాలి:**

కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య మాట్లాడుతూ.. అంబానీ, అదానీల ప్రయోజనాల కోసమే మోదీ విదేశాంగ విధానం ఉందని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలపై సర్వే నిర్వహించామని, అప్పుల్లేని కుటుంబం జిల్లాలో లేదని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ముందు ఎండి పాషా పార్టీ జెండాను ఆవిష్కరించగా, బూరుగు కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, కొండమడుగు నరసింహ, కల్లూరు మల్లేశం, మాటూరి బాలరాజు గౌడ్, జల్లెల పెంటయ్య, గుంటూజు శ్రీనివాస్ చారి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, గోశిక కరుణాకర్, గంగాదేవి సైదులు, జిల్లా గీత కార్మిక సంఘం అధ్యక్షుడు రాగిరి కిష్టయ్య, చౌటుప్పల్ మున్సిపల్ కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాసు గౌడ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధు కృష్ణ, గడ్డం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



# కంఠమహేశ్వర స్వామిని దర్శించుకున్న దైద రవీందర్

**- దుబ్బాకలో ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం.. అభివృద్ధికి విరాళం అందజేత**

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలం దుబ్బాక గ్రామంలో వెలిసిన శ్రీ శ్రీ సురమాంబ సమేత కంఠమహేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఈ వేడుకలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అభివృద్ధి నిధి కోసం రూ. 10,116/- నగదును విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, గ్రామాల్లో ఇలాంటి ఆలయాల నిర్మాణం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండాల నర్సింహ గౌడ్, మాజీ సర్పంచ్ గుండాల నర్సింహ, గట్టు యాదయ్య, నాయకులు గుండాల సతీష్, శెట్టి శేఖర్, బత్తుల రమేష్, బి.ఎన్. గౌడ్, గట్టు శ్రీనివాస్, గట్టు బాలు, గుండాల కిరణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బోగారంలో కన్నులపండువగా హనుమాన్ జయంతి

**- భక్తిశ్రద్ధలతో హోమం, అభిషేకాలు**

**- అన్నప్రసాద వితరణలో పోటెత్తిన భక్తులు**



**తొలివెలుగు, రామన్నపేట:** మండలంలోని బోగారం గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నిత్యానందం పంతులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమం, అభిషేకం, ప్రత్యేక హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కోడి పాండునాథ్ - వర్షిణి దంపతుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ అన్నదానంలో భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ వేడుకల్లో ఆలయ శాశ్వత చైర్మన్ జెల్ల మార్కండేయ, మాజీ సర్పంచ్ రాపోలు శివరంజని, మాజీ ఉపసర్పంచ్ జెల్ల శ్రీనివాస్, కందగట్ల నరసింహ, కందగట్ల శ్రీనివాసులు, కూనూరు శ్రీనివాస్ గౌడ్, గండూరి వెంకటేశ్వర్లు, అంతటి మల్లేష్ గౌడ్, జెల్ల మల్లేశం, రచ్చ ఆనంద్, జెల్ల రఘు రాములు, శానకొండ గోపాలు, పబ్బు ధనంజయ గౌడ్, రేవతి కృష్ణ, రచ్చ మోహన్, రాపోలు అశోక్, అరవిందు, కనుక రాము, కూనూరు వెంకటేష్, బొడ్డుపల్లి నవీన్, నాయిని మల్లేశం, మేడి కృష్ణ, బడుగు శివ, బొడ్డుపల్లి రాజు, జెల్ల సుధీర్, బద్దుల మల్లేష్, కదారి శ్రీనివాస్, జెల్ల అరుణ్ కుమార్, వనం వెంకటేష్, ఆలయ సిబ్బంది మేడి శంకరయ్య పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాహత్ ఖానం**

**- రామన్నపేటలో ఘనంగా విద్యా వారోత్సవాలు**



**తొలివెలుగు, రామన్నపేట:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. మంగళవారం విద్యార్థులకు యోగాపై అవగాహనతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధతపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ.. నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా ఒక దివ్యౌషధమని అన్నారు. అనంతరం విద్యార్థులకు పీజీ ప్రవేశ పరీక్షలు, ఇతర పోటీ పరీక్షల పట్ల అధ్యాపకులు డాక్టర్ జె. చిన్నబాబు, డాక్టర్ జి. సునీత అవగాహన కల్పించారు. కార్యక్రమ ఇన్చార్జి డాక్టర్ ఎం. రవీందర్ రావు విద్యార్థులకు వివిధ యోగాసనాలను స్వయంగా నేర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు డాక్టర్ రత్న మంజుల, డాక్టర్ లక్ష్మీ నీలిమ, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, డాక్టర్ డి. కిషన్, డాక్టర్ రాచమళ్ళ శ్రీను, ఎస్. బాలరాజు, జె.నరేశ్, ఎ. ఆంజనేయులు, రాధిక, కార్యాలయ సిబ్బంది కరుణాకర్ రెడ్డి, ఫయాజ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో యువ రైతు నిరంజన్ రెడ్డి మృతి



**తొలివెలుగు, చౌటుప్పల్:** కష్టపడి పని చేసే వేళ కాలం కాటు వేసింది. పొలం పనుల్లో నిమగ్నమై ఉన్న ఓ యువ కౌలు రైతు గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. మండల పరిధిలోని ఖైతాపురం గ్రామానికి చెందిన కందగట్ల నిరంజన్ రెడ్డి (36), మల్కాపురం రెవెన్యూ పరిధిలో భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. మంగళవారం పొలం వద్ద గడ్డిమోపు కడుతుండగా ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. సమీపంలో ఉన్న వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు వెంటనే చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే నిరంజన్ రెడ్డి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్న వయసులోనే నిరంజన్ రెడ్డి మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

# ఆత్మరక్షణకు కరాటే అవసరం





**- మునిపంపుల సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం**

**- భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభం**

**తొలివెలుగు, రామన్నపేట:** విద్యార్థులు చదువుతో పాటు శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి కరాటే వంటి యుద్ధకళలు ఎంతో దోహదపడతాయని మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. మంగళవారం గ్రామంలోని భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి కరాటే శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు స్వీయ రక్షణ పట్ల అవగాహన ఉండాలన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల క్రమశిక్షణ అలవడుతుందని, భయం పోయి ధైర్యం పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఇలాంటి ఉచిత శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా క్రీడలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. గ్రామ పంచాయతీ తరపున విద్యార్థుల అభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ రాచకొండ రాజు, నాయకులు తాళ్ళపల్లి జితేందర్, గంటెపాక శివ కుమార్, తౌలుపునూరి చంద్ర శేఖర్, బూడిద బిక్షం, జంపాల ఉమాపతి, ఆకుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో మారుతీ నామస్మరణ

**- కన్నులపండువగా హనుమాన్ జయంతి.. శోభాయాత్రలో పోటెత్తిన భక్తులు**

**తొలివెలుగు, చౌటుప్పల్:** మండల వ్యాప్తంగా మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. పట్టణంలోని 9వ వార్డులో గల శ్రీ పెరుమాళ్ళ ఆంజనేయ స్వామి దేవాలయంలో కమిటీ అధ్యక్షుడు ముత్యాల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. పాటిమీది శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో కమిటీ ప్రతినిధులు సందగళ్ల నాగరాజు, ఊడుగు రమేష్ గౌడ్ ల నేతృత్వంలో స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, విశేష పూజలు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ వినయ్ కుమార్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం వేళ అంగరంగ వైభవంగా నిర్వహించిన పల్లకి సేవ, శోభాయాత్ర భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, దేప రమ్య రాజు, బత్తుల వాణి విప్లవ్, ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, పిల్లలమర్రి మధుసూదన్, కో-ఆప్షన్ సభ్యులు పస్తం గంగరాములు, ఆలయ కమిటీల ప్రతినిధులు అనెమోని చంద్రయ్య, కలకుంట్ల శివకుమార్, పోలోజు రామాచారి, ఎన్నం బాలరాజు, సామిడి రాఘవరెడ్డి, మంచికంటి భాస్కర్, ముత్యాల మోహన్ రెడ్డి, ముత్యాల హనుమంత్ రెడ్డి, ఊడుగు శ్రీనివాస్ గౌడ్, బొడిగె బాలకృష్ణ, దండ అరుణ్ కుమార్, బొబ్బిళ్ళ మురళి, పోలోజు శ్రీధర్ బాబు, సుర్వి నరసింహ గౌడ్, దాచేపల్లి శ్రీనివాస్, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.







# సాగు మెళకువలపై శాస్త్రవేత్తల వేదిక!

**- నేడు చౌటుప్పల్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' సదస్సు**

**- క్లస్టర్ల వారీగా రైతుల సమీకరణ**

**- మండల వ్యవసాయ అధికారి నాగరాజు వెల్లడి**

**తొలివెలుగు, చౌటుప్పల్:** వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన మార్పులు, సాగు మెళకువలపై రైతులకు అవగాహన కల్పించేందుకు బుధవారం చౌటుప్పల్ రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం. నాగరాజు తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు కీలక సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. ముఖ్యంగా చౌటుప్పల్, తంగడపల్లి, జై కేసరం, లింగోజిగూడెం, పంతంగి క్లస్టర్ గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సాగులో ఎదురవుతున్న సమస్యలపై శాస్త్రవేత్తలతో నేరుగా చర్చించేందుకు ఇది మంచి వేదిక అని ఆయన పేర్కొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

**- అకస్మాత్తుగా బైక్‌కు అడ్డొచ్చిన గుర్తుతెలియని వ్యక్తి**

**- తూప్రాన్‌పేట వద్ద ఘటన.. ఒకరికి గాయాలు**



**తొలివెలుగు, చౌటుప్పల్:** బైక్ ప్రయాణంలో ఎదురైన ఊహించని అడ్డంకి ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంది. తూప్రాన్‌పేట గ్రామ పరిధిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ బక్కతట్ల జంగయ్య (57), అక్కడికక్కడే మృతి చెందారు. ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జంగయ్య తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో భాస్కర్ ఆగ్రో కెమికల్ కంపెనీ సమీపంలో ఒక గుర్తుతెలియని వ్యక్తి అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో జంగయ్య బైక్ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన జంగయ్యకు తలకు తీవ్ర గాయం కావడంతో ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన మరో వ్యక్తిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ తెలిపారు.

## పంతంగి టోల్‌గేట్ వద్ద 23 పశువుల పట్టివేత

**- డీసీఎంలో తరలిస్తుండగా పోలీసుల తనిఖీ**

**- ముగ్గురిపై కేసు నమోదు.. పశువులు సురక్షిత ప్రాంతానికి తరలింపు**



తొలివెలుగు, చౌటుప్పల్: మండల పరిధిలోని పంతంగి టోల్‌గేట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పంతంగి చెక్ పోస్ట్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన డీసీఎం వాహనాన్ని ఆపి సోదా చేశారు. అందులో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 10 ఆవులు, 4 ఎద్దులు, 9 దూడలను గుర్తించారు. డ్రైవర్ రమావత్ శరత్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, ఏపీలోని జగ్గంపేట సంతలో వీటిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించాడు. ఈ మేరకు డ్రైవర్ శరత్ కుమార్, వాహన యజమాని రాజు, కొనుగోలుదారు వీరబాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పశువులను సురక్షిత ప్రాంతానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ నరేష్, సీతారాంరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.


జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


## నా వైఫ్ మిస్సింగ్



వరుణ్ సందేశ్ హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'నా వైఫ్ మిస్సింగ్' అనే టైటిల్ ఖరారైంది. 'నయనం' వెబ్ సిరీస్ ఫేమ్ దర్శకురాలు స్వాతి ప్రకాశ్ మంత్రిప్రగడ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఆహో సమర్పణలో కొమర మీడియా వర్క్స్ పతాకంపై శివ కంఠంనేని, ఆర్. వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి నటుడు–నిర్మాత, ఫిల్మ్ చాంబర్ సెక్రటరీ అశోక్ కుమార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత సి. కల్యాణ్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు నీలకంఠ గౌరవ దర్శకత్వం వహించారు. "సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్‌లో చక్కటి ప్రేమకథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం" అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సాయికార్తీక్, కెమెరా: సతీష్ కుమార్ ఎన్ఎస్.




## 'పెద్ది' ట్రైలర్ రిలీజ్‌డేట్ ఫిక్స్

మెగా అభిమానులకు గుడ్ న్యూస్. 'పెద్ది' ట్రైలర్ రిలీజ్ అప్‌డేట్ వచ్చేసింది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇది. జాన్వీ కపూర్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ప్రచార కార్యక్రమాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా మే 18న 'పెద్ది' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది. పాన్ ఇండియా మూవీగా 'పెద్ది'ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. వాటిని మించేలా ట్రైలర్ ఉంటుందని ఇన్‌సైడ్ టాక్. మరోవైపు సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఏఆర్ రెహమాన్ నేపథ్య సంగీతం మరో స్థాయిలో ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం బుచ్చిబాబు ఇటు ట్రైలర్‌ను సిద్ధం చేయడంతో పాటు, అటు మూవీ ఫైనల్ కట్‌ను కూడా రెడీ చేస్తున్నారట. సెన్సార్ ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే తగిన విధంగా చిత్ర బృందం ముందుకు సాగుతోంది. ప్రచార కార్యక్రమాలను కూడా భారీగా చేయాలని యోచిస్తున్నారు. రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, దివ్యేందు, జగపతిబాబు, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రుతిహాసన్ స్పెషల్ సాంగ్‌లో మెరవనున్నట్లు సమాచారం.

తమిళనాడులో నెలకొన్న ఉత్కంఠకు తెర దించుతూ.. ముఖ్యమంత్రిగా టీవీకే అధినేత విజయ్ ఆదివారం ఉదయం ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమంలో నటి త్రిష సందడి చేశారు. సంప్రదాయ చీరకట్టులో నీలం రంగు పట్టుచీరలో హుందాగా కనిపించిన త్రిష అందరి దృష్టిని ఆకర్షించారు. విజయ్ ప్రమాణస్వీకారం అనంతరం ఆమె తాజాగా ప్రేమ గురించి పోస్ట్ పెట్టారు. "ప్రేమ ఎప్పుడూ గొప్పగానే వ్యక్తమవుతుంటుంది" అంటూ నీలిరంగు హార్ట్ ఏమోజీని జోడించారు. తనకెంతో ఇష్టమైన తన టీమ్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఆమె పంచుకున్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. విజయ్‌తో త్రిష ఐదు సినిమాల్లో నటించారు. అవి హిట్‌గా నిలవడమే కాకుండా ఇద్దరి కెరీర్‌ను మలుపుతిప్పాయి. తొలి సినిమా సమయంలోనే ఇద్దరూ మంచి స్నేహితులు అయ్యారు. ఆదివారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలోనూ విజయ్ ప్రమాణం చేస్తుండగా ఆమె కొంచెం భావోద్వేగానికి గురయ్యారు.

## ప్రేమ ఎప్పుడూ గొప్పదే.. విజయ్ సీఎం అయ్యాక త్రిష తొలి పోస్ట్







భిన్న కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు దర్శకుడు సంపత్ నంది సిద్ధమవుతున్నారు. ఆయన దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా రానున్న చిత్రం 'భోగి'. ఆగస్టు 28న విడుదల కానుంది. ఇప్పటికే హీరో, హీరోయిన్ లుక్స్‌తో అంచనాలు కలిగించిన ఆయన తాజాగా ఇందులో కీలకపాత్రలో నటిస్తోన్న డింపుల్ హయాతి లుక్‌ను పంచుకున్నారు. ఇందులో ఆమె మందారం అనే పాత్రలో కనిపించనున్నట్లు దర్శకుడు చెప్పారు. ఎవరినీ లెక్కచేయని ఓ బోల్డ్ పాత్రలో ఆమె నటిస్తున్నట్లు తెలిపారు. 'ప్రపంచానికి ఆమె సౌందర్యం కావాలి. కానీ, ఆమె మనసును ఎవరూ అర్థం చేసుకోరు' అనే క్యాప్షన్‌తో డింపుల్ లుక్

## బోల్డ్ పాత్రలో డింపుల్.. భోగి లుక్ రిలీజ్


పోస్టర్‌ను పంచుకున్నారు.ఇటీవలే అనుపమ పరమేశ్వరన్ పాత్రను కూడా టీమ్ పరిచయం చేసింది. ఇందులో (Bhogi) ఆమె 'కందుల సులోచన రాణి'గా కనిపించనున్నారు. 'ప్రకృతి బిడ్డ.. గంగమ్మ నిలయం.. కందుల వారి గర్వం.. భోగి చిత్రానికి ఆమె ప్రాణం' అని ఆ పాత్రను పరిచయం చేశారు. ఉత్తర తెలంగాణ - మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ కథని పాన్ ఇండియా స్థాయిలో తెర పైకి తీసుకొస్తున్నారు.

## 'వారణాసి' లేటెస్ట్ షెడ్యూల్ మళ్లీ మొదలైంది... సెట్స్ పై ప్రియాంక చోప్రా!



సూపర్‌స్టార్ మహేష్‌బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'వారణాసి పై కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో నటిస్తున్న గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా తాజా షెడ్యూల్ లో షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు."వారణాసి, హియర్ వి గో!" అనే క్యాప్షన్‌తో ఆమె ఒక ఫోటోను పోస్ట్ చేయడంతో, కొత్త షెడ్యూల్ ప్రారంభమైనట్లు అధికారికంగా వెల్లడైంది. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో నీటి కొరత కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయిన షూటింగ్‌ను ఇప్పుడు పునఃప్రారంభించారు. తాజా అప్‌డేట్‌తో ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి.ఈ సినిమాలో మహేష్ బాబు సరసన ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరితో పాటు మాధవన్, ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖ నటులు కూడా ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. ఎస్.ఎస్. కార్తికేయ, కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 2027 ఏప్రిల్ 7న ఈ సినిమాను విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.

## మోదీని ముట్టుకున్నా.. నా జన్మ ధన్యం: తనికెళ్ల భరణి



ప్రధాని నరేంద్ర మోదీ తో కలిసి దిగిన ఫొటోను పంచుకుంటూ ఎమోషనల్ పోస్టు పెట్టారు నటుడు తనికెళ్ల భరణి . "నేను రాముణ్ని చూడలేదు. కృష్ణుణ్ని చూడలేదు. ఆదిశంకరుల్ని చూడలేదు. వివేకానందుణ్ని చూడలేదు. చూడలేం కూడా. కానీ. వాళ్లందరి అంశలతో ఉన్న మోదీ గారిని చూశాను. ముట్టుకున్నాను. ఆయన చేతిని ముద్దెట్టుకున్నాను. నా జన్మ ధన్యం" అని పేర్కొన్నారు. మోదీ హైదరాబాద్‌లో ఆదివారం పర్యటించిన సంగతి తెలిసిందే. విమానాశ్రయంలో ఆయన్ను కలిశారు తనికెళ్ల భరణి.

## చిరంజీవి 'విశ్వంభర' రెండు పార్టులా? "నిజమా" అంటూ దర్శకుడి సెటైర్!



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న భారీ చిత్రం 'విశ్వంభర'పై సోషల్ మీడియాలో వస్తున్న ఓ కీలక ప్రచారానికి దర్శకుడు వశిష్ట తెరదించారు. ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయనున్నారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఈ సినిమా విడుదలపై నెలకొన్న ఓ ప్రధాన సందేహానికి తెరపడినట్లయింది. 'విశ్వంభర' రెండు భాగాలుగా రాబోతోందంటూ ఇటీవల ప్రచారం జోరుగా సాగింది. దీనిపై ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు దర్శకుడు వశిష్ట స్పందిస్తూ.. "ఓహో, నిజమేనా?" అని వ్యంగ్యంగా బదులిచ్చారు. ఆయన సమాధానంతో ఈ చిత్రం ఒకే భాగంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తేలిపోయింది.వశిష్ట దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. సోషియో ఫాంటసీ కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాలో చిరంజీవి సరసన త్రిష కథానాయికగా నటిస్తున్నారు. సృష్టి, స్థితి, లయ అనే అంశాల చుట్టూ ఈ కథ సాగుతుందని సమాచారం.ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి దీనికి సంగీతం అందిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి.ఈ చిత్రంలో ఆషిక రంగనాథ్, రమ్య పసుపులేటి, ఇషా చావ్లా వంటి ఇతర తారలు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వాస్తవానికి ఈ సినిమాను ఎప్పుడో విడుదల చేయాలని భావించినా, చిత్రీకరణలో జాప్యం కారణంగా వాయిదా పడింది. ప్రస్తుతం సినిమా షూటింగ్ ఏ దశలో ఉందనే దానిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.